
**కథ**



> ఆ చిరునవ్వు భయంకరంగా కన్పించింది వాసుకి. భయం, ఆందోళన, సిగ్గు కలగలిసి వాసు మొహం వికృతంగా మారిపోయింది.

# బూమరాంగ్

**రావు కృష్ణారావు**

**"గుడ్‌మాణింగ్ డాడ్! హవ్వార్యూ?"**

**అంటూ వచ్చాడు వాసు.**

**"వెరీ గుడ్‌మాణింగ్ మై బోయ్! అయామ్ ఫైన్! ఆఫీసుకి బయలుదేరావా? శైలజేది?" కిటికీ పక్కనే కూర్చుని ఎండ కాగుతున్న నిరంజనరావు అడిగాడు.**

"పనుందని తను ఎర్లీగా వెళ్ళింది! బైదిబై ఎవ్రిథింగ్ ఓకే డాడ్? నిన్న డాక్టరొచ్చాడా? కొత్త వంటవాడు బాగా చేస్తున్నాడా? మా గురించి చూడకండి. మీకు నచ్చకపోతే మార్చేద్దాం. మేం వారానికి ఒకటి రెండు రోజులు కూడా ఇంట్లో తినడం కుదరడం లేదు".

"బాగానే చేస్తున్నాడు... ఇట్సాల్‌రైట్... మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి". ఈ మాటలంటున్నపుడు నిరంజనరావు మొహంలో కాస్త విషాదం గోచరించింది. వాసు అది గ్రహించాడు.

"మీకెలా గడుస్తోంది? బోరు కొడుతోందా?" అడిగాడు వాసు. అపుడే పనివాడు కాఫీ మగ్ తెచ్చి వాసుకందించాడు.

"నర్సులు బాగా అటెండవుతున్నారా? రాముగాడు చెప్పినట్టు వింటున్నాడా?"

"రాము కుక్కకంటే విశ్వాసంగా అంటిపెట్టుకుని వుంటున్నాడు. ఈ రెండు రోజులూ వాడులేని లోటు స్పష్టంగా తెలిసింది. ఇంక నర్సులంటావా? దె ఆర్ నాట్ హేపీ. ఏక్టివ్‌గా పనిచేసేవాళ్ళకు ఖాళీగా కూర్చోవడం ఎంత బాధాకరమో నాకు తెలుసు" చివరిమాట చెబుతున్నపుడు నిరంజనరావు గొంతులో విచారం ధ్వనించింది.

"వెంకన్నకు సిస్టిక్‌లంగ్ అట. ఆపరేట్ చెయ్యాలన్నాడు డాక్టరు. చేసెయ్యమన్నాను" చెప్పాడు వాసు.

"లంగ్ ఆపరేషన్ అంటే కాస్ట్లీ ఎఫైర్ కదూ!" సాలోచనగా అన్నాడు నిరంజనరావు.

"ఫార్టీ థవుజండ్ అవుతుందన్నాడు. వెంకన్న నేను పుట్టకముందు నుండీ మనింట్లో పని చేస్తున్నాడు. రాముగాడు కూడా మనతోనే వుండిపోయాడు... మిగతా మాటలు పూర్తిచేయలేదు వాసు.

"అదంతా నిజమే! కానీ వెంకన్న వైద్యానికి అంత ఖర్చు చేయడం..."

"వెంకన్నంటే మీకు చాలా ఇష్టమనే నేను సిద్ధమయ్యాను". సంజాయిషీ ఇచ్చుకున్నట్టు చెప్పాడు.

"నిజమే. నాకు వెంకన్నంటే చాలా ఇష్టం. అయితే నీలాంటి యంగ్ బిజినెస్‌మాన్ ప్రాక్టికల్‌గా ఆలోచించాలి. సెంటిమెంట్స్ పనికిరావు. సర్జరీ తర్వాత వెంకన్న పని చేయగలడా? అది ఆలోచించావా? అన్‌ప్రొడక్టివ్ ఎక్స్‌పెండిచర్ బిజినెస్‌లో పెద్ద క్రైమ్!

"నేనిది బిజినెస్‌గా చూడలేదు. మన ఫేమిలీ మేటరనీ, వెంకన్న మన ఫేమిలీ మెంబరనీ అనుకున్నాను"

"నువ్వు చాలా చైల్డిష్‌గా ఆలోచిస్తున్నావు. కుటుంబ వ్యవహారాలకు బిజినెస్‌కూ తేడా ఏముంది? ఆఫ్టరాల్ లైఫ్ ఈజ్ ఆల్సో ఎ బిజినెస్" చిరునవ్వుతో చెప్పాడు నిరంజనరావు.

ఆ చిరునవ్వు భయంకరంగా కన్పించింది వాసుకి. భయం, ఆందోళన, సిగ్గు కలగలిసి వాసు మొహం వికృతంగా మారిపోయింది.

"అయితే సర్జరీవద్దని మందులిచ్చి పంపేయమని డాక్టరుకి చెప్తాను లెండి" అన్నాడు తలదించుకునే!

"నో.నో. అలాంటి పిచ్చి పనిచేయకు.డాక్టరు దృష్టిలో లోకం దృష్టిలో నీ ఇమేజ్ ఏమైపోతుంది. నలభైవేల కోసం వెనకడుగు వేస్తే నీ గుడ్‌విల్‌కు నలభై లక్షల నష్టం వాటిల్లుతుంది." అన్నాడు నిరంజన్‌రావు.

"ఈ గుడ్‌విల్ మాత్రం సెంటిమెంటు కాదా?"

"గుడ్ క్వశ్చన్. ఇది కూడా సెంటిమెంటే. మనకు సెంటిమెంట్లు ఉండకూడదన్నాను గాని సెంటిమెంట్లను కాష్ చేసుకోవద్దనలేదు. ప్రజల్లో నూటికి తొంభైమంది వఠి సెంటిమెంటల్ ఫూల్స్. వారికోసం మనమూ సెంటిమెంట్లను గౌరవించాలి. మనవట్ల, మన కంపెనీపట్ల ప్రజలకుండే సదభిప్రాయం మనం పెట్టని పెట్టుబడి. వీలైనంత తక్కువ ఖర్చుతో మనమీ గుడ్‌విల్‌ని సంపాదించాలి. అండర్‌స్టాండ్?" అని చెప్పి విజయగర్వం సూచించే దరహాసంతో వాసువైపు చూస్తూ కూర్చున్నాడు. విప్పారిన కళ్ళతో తండ్రిని చూస్తూ వాసు కాసేపు మౌనంగా ఉండిపోయాడు. మరో నిమిషం తర్వాత లేస్తూ "కెన్ఐ టేక్ లీవ్ డేడ్?" అని నెమ్మదిగా కదిలాడు.

** ** **

"ఎలా ఉన్నావురా నిరంజనం?" అంటూ వచ్చాడు ధర్మారావు.

"ఫైన్! కూతురూ మనవళ్ళూ వెళ్ళిపోయారా?" అడిగాడు నిరంజనరావు.

"ఆ వెళ్ళిపోయారు! ఈ వారం రోజులూ క్షణాల్లాగ గడిచిపోయాయనుకో! వాళ్ళు వెళ్ళిపోగానే ఇల్లంతా బోసిపోయింది. లంకంత ఇంట్లో ఎలా ఉంటున్నావురా! రాముడు కనిపించడేం?

"వెంకన్నకు లంగ్ ఆపరేషన్ చేయించాం. అయిదు రోజులవుతోంది. వాళ్ళ నాన్న దగ్గర హాస్పిటల్లో ఉన్నాడు."

"ఆ... అవును మరిచిపోయాను. వాసు చెప్పాడు. నువ్వే చేయించమన్నావట కదా! చాలా మంచిపని చేశావు. తన జీవితమంతా మీతోనే ముడిపడి ఉంది కదా!"

నిరంజనరావు ఆశ్చర్యపోయినా అది కనబడకుండా జాగ్రత్త పడ్డాడు. మరి కాసేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు ధర్మారావు. నిరంజనరావు భోజనంచేసి నర్సు ఇచ్చిన మందులు మింగి టీవీ ముందుకు వచ్చాడు వీల్‌చైర్‌లో.

అంతలో శైలజవచ్చింది. "హవ్వార్యూ అంకుల్" అని పలకరించింది.

"ఫైన్.... ఈరోజు ఎర్లీగా వచ్చినట్టున్నావే" అన్నాడు నిరంజనరావు.

"త్వరగా ఇంటికి వెళ్ళమని, మీతో కబుర్లు చెప్పమని వాసు గొడవ చేస్తున్నాడు" అంది.

"నిరంజనరావుకి చాలా సంతోషమనిపించింది. అయితే మరుక్షణం మొహం గంభీరంగా మార్చి "ఇంటి దగ్గరున్నవాళ్ళ కాలక్షేపంకోసం పని మానుకొని త్వరగా ఇంటికి చేరడమనేది మనలాంటి బిజినెస్ ఫామిలీలో ఎవరూ చెయ్యకూడని పని. అరవై ఏళ్ళకే నేను పని చేయ లేకుండా పోవడం బాడ్‌లక్. నాకోసం యంగ్ అండ్ డైనమిక్‌గా ఉన్న నువ్వు పని మానుకొని ఇంటి కొచ్చేయడం రియల్లీ వెరీబాడ్. "ఐ డోంట్ లైకిట్" అన్నాడు.

"ఎవరికోసం ఇదంతా? రాత్రీ పగలూ అనక, ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయక క్రోర్స్ సంపాదించారు. మీరు సంపాదించిందాన్ని అనుభవిస్తున్న మాకు మిమ్మల్ని సంతోషంగా ఉంచవలసిన బాధ్యత కూడా ఉంది కదా!" అంది శైలజ.

"నో... నేను సంపాదించింది మీరు అనుభవించడానికి కాదు. ముప్పై ఏళ్ళు కష్టపడి వందకోట్లదాకా తెచ్చాను. మీరు దాన్ని వెయ్యి కోట్లు చేయాలి. నా మనవడు దాన్ని పదివేలకోట్లు చేయాలి. మనది పెద్ద బిజినెస్ ఫామిలీ కావాలి" స్థిరమైన గొంతుతో చెప్పాడు నిరంజనరావు.

"ఏమో బాబూ! మీ మాట మా ఇద్దరికీ వేదవాక్కే అయినా ఎందుకో మీ ఫిలాసఫీని నేను ఏక్సెప్ట్ చేయలేకపోతున్నాను. మీ మాట జవదాటకూడదని వాసు పదేపదే చెబుతాడు. అవును అడగడం మర్చిపోయాను. ...నర్సులను మానిపించేయమంటున్నారటేమిటి? ముగ్గురికీ కలిపి నెలకు పదివేలేకదా ఇస్తున్నాం!అది మనకోలెక్కా?"అంది శైలజ.

మంచినీళ్ళు తాగబోయిన నిరంజనరావుకి పలమారింది. ఉక్కిరిబిక్కిరయ్యాడు. శైలజ చప్పున లేచి నిరంజనరావు బట్టతలమీద సున్నితంగా అరచేతితో కొట్టసాగింది. కాసేపటికి తేరుకున్నాడతను. అతని మొహంలో ఏదో భయం కనిపిస్తోంది. అతనేమీ మాట్లాడలేదు.

"మీ విషయంలో పొదుపు చెయ్యడం నాకెంత మాత్రమూ ఇష్టం లేదు" అని లేచి వెళ్ళిపోయింది శైలజ. కుర్చీలో నీరసంగా తలవాల్చేశాడు నిరంజనరావు.

మర్నాడు ఉదయం నిరంజనరావు గదిలోకి వచ్చిన వాసు కుశల ప్రశ్నలైన తర్వాత "ఈ ఏడు కంపెనీ ఏనివర్సరీ జరపకూడదనుకుంటున్నాను" అంటుండగానే నిరంజనరావు ఏదో చెప్పబోయాడు. "లెట్‌మీ కంప్లీట్ డాడ్...ఏనివర్సరీకి బదులుగా ఇకనుండి మీ బర్త్‌డే సెలబ్రేట్ చెయ్యాలనుకుంటున్నాను. ఈ విషయంలో మీరు నో అనడానికి వీల్లేదు" అన్నాడు.

నిరంజనరావు కాస్సేపు ఆశ్చర్యంగానూ, అయోమయంగానూ చూసి "శైలూని త్వరగా ఇంటికెళ్ళమన్నావట" అనడిగాడు.

అవును ఈమధ్య లేడీస్ మీద అట్రాసిటీస్ బాగా పెరిగిపోతున్నాయి. ఆఫీసు సిటీ బయటుంది. లేట్‌నైట్ ఒంటరిగా కార్లో రావడం మంచిదికాదని..." అన్నాడు వాసు. ఒక్కసారే దగ్గుతెర ముంచుకొచ్చింది నిరంజనరావుకి. తేరుకొని వాసుకేసి నీరసంగా చూశాడు.

వాసు కంగారుపడుతూ "డాక్టరుకి ఫోను చెయ్యనా?" అనడిగాడు.

వద్దని తలూపాడు నిరంజనరావు. వాసు కాసేపు గడిపి వెళ్ళిపోయాడు.

** ** **

ఫాక్టరీలో నిరంజనరావు జన్మదినోత్సవం ఘనంగా జరుగుతోంది. ఆరోజు సెలవు ప్రకటించాడు వాసు. కార్మికులకు విందు, కొత్తబట్టలు, బోనస్ ఏర్పాటు చేశారు. కార్మికులంతా చాలా ఉత్సాహంగా ఉన్నారు. వేదికపై నిరంజనరావు, అతని మిత్రులు మరో ఇద్దరూ ఆసీనులై ఉన్నారు. మిత్రులంతా నిరంజనరావుని పొగిడారు. సభ ముగింపు వాక్యాలు పలకడానికి వాసు మైకు ముందుకొచ్చాడు. నిరంజనరావు ముందుకు వంగి ఆసక్తిగా వాసుకేసి చూడసాగాడు.

"మా నాన్నగారు ఈ కంపెనీని స్థాపించి దానినెలా అభివృద్ధి చేసిందీ, దానికోసం ఆయనెంత కష్టపడిందీ నాకంటే మీకే బాగా తెల్సు. మీకు తెలియని విషయం ఒకటి చెబుతాను. ఆయన వెన్ను శస్త్రచికిత్సకు లండన్ వెళ్ళవలసి ఉంది. కంపెనీ పనుల ఒత్తిడిలో రెండుసార్లు వాయిదా వేసుకున్నారు. దానివల్ల ఆయన కాళ్ళు పడిపోయాయి" సభలో ఒక్కసారిగా గుసగుసలు పెద్ద హోరులా విన్పించాయి. ఒక్క నిముషం ఆగిన వాసు మళ్ళీ ప్రారంభించాడు. మా నాన్నగారని గొప్ప చెప్పుకోవడంకాదు. ఆయనంత త్యాగశీలిని నేనింత వరకు చూడలేదు. ఆయనకు సాయపడటానికి ముగ్గురు నర్సులను నియమిస్తే వద్దని మానిపించేయమంటున్నారు. అంతెందుకు ఈరోజు మీ అందరికీ అన్నీ చెయ్యమన్నారు. తనకు పూలదండ, శాలువా కూడా కొనడానికి అంగీకరించలేదు. అన్నిటికంటే మమ్మల్ని బాధిస్తున్న విషయం ఏమిటంటే..."మాటలు రానట్టు కాసేపు ఆగాడు. నిరంజనరావు భయంగా చూడసాగాడు. "ఆయనింట్లో ఉంటే మేం ఆయన కోసం టైము వేస్టు చేస్తున్నామని ఓల్డేజ్ హోమ్‌లో చేరిపోవాలనే కఠిన నిర్ణయం తీసుకున్నారు" అంటూ కళ్ళు తుడుచుకున్నాడు వాసు. నోరు తెరుచుకుని అలా ఉండిపోయిన నిరంజనరావు "అమ్మ నా కొడకా!" అని మూలిగాడు. •



## స్వేచ్ఛ

మొదటిరోజు ఆఫీసుకు వచ్చాడు సారధి. మేనేజరు పిలిచి ఇలా చెప్పాడు-

"మా ఆఫీసులో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ వుంది. నువ్వు స్వతంత్రుడిగా వ్యవహరించవచ్చు. ఎప్పుడు రావాలంటే అప్పుడు రావచ్చు. ఎప్పుడు వెళ్ళాలంటే అప్పుడు వెళ్ళవచ్చు" అన్నాడు.

"నిజంగానా సార్?" ఆనందంగా అడిగాడు సారధి.

"అవును. ఉదయం ఎనిమిదికి ముందు ఎప్పుడయినా రావచ్చు. సాయంత్రం ఆరు గంట తర్వాత ఎప్పుడయినా వెళ్ళవచ్చు" గంభీరంగా అన్నాడు మేనేజర్.

